కొత్తగూడెం.. కార్పొరేషన్ అయిందోచ్..!

సంబురాల్లో సీపీఐ శ్రేణులు

కొత్తగూడెం అర్బన్, జనవరి 5: కొత్తగూ డెం, పాల్వంచ జంట పట్టణాలతోపాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కలుపుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై నియోజకవర్గ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతున్నది. ఏజెన్సీ ప్రాంతాలకు జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం కార్పొరేషన్‌గా ఏర్పాటైతే అన్నింటా అభివృద్ధి జరిగే అవకాశాలు ఉంటాయి. కార్పొరేషన్ ఏర్పాటుపై సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, ఫహీం, మాచర్ల శ్రీనివాస్, పొలమూరి శ్రీను పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

నిందితులతో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు

బూర్గంపహాడ్, జనవరి 5: పేకాట స్థావరంపై కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసిన ఘటన మండలంలోని కృష్ణసాగర్ పంచాయతీ చెరువు సింగారంలో ఆదివారం చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్ ఎస్సై జలకం ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణసాగర్ పంచాయతీ చెరువు సింగారం గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఎస్సై రామారావు, స్థానిక ఎస్సై రాజేశ్, సిబ్బందితో పేకాటస్థావరంపై దాడిచేశారు. దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.18,050 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని బూర్గంపహాడ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు

జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అశ్వారావుపేట(ములకలపల్లి), జనవరి 5 : కోడిపందేల స్థావరంపై స్థానిక పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ములకలపల్లి మండలం రింగిరెడ్డిపల్లి అటవీప్రాంతంలో ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్సై ప్రవీణ్, స్థానిక ఎస్సై రాజశేఖర్ సిబ్బదితో దాడి చేశారు. దాడిలో 9మంది జూదరులను అదుపులోకి తీసుకుని రూ.15 వేలు నగదు, 9 కోడిపుంజులు, 9 ద్విచక్ర వాహనాలు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సింగరేణి కన్వీనియన్స్ డ్రైవర్ల నూతన కమిటీ ఎన్నిక

కమిటీ సభ్యులతో షేక్ యాకుబ్ షావలి

ఇల్లెందు, జనవరి 5: ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, (టీయూసీఐ అనుబంధ సంస్థ) అద్దె వాహనాల డ్రైవర్ల నూతన కమిటీ 21మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఎల్లన్న భవనంలో భూక్యా రాజేశ్, రెడ్డిబోయిన గోపి, తేజావత్ వెంకన్న అధ్యక్షతన జరిగిన సింగరేణి కన్వీనియన్స్ డ్రైవర్ల నిర్మాణ జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్ షావలి మాట్లాడారు. అనంతరం జీఎం కార్యాలయం, జేకే 5 ఓసీ, కేఓసీలో మొత్తం 21మందితో కమిటీని ఎన్నుకున్నారు. అందులో ఏడుగురు ఆఫీస్ బేరర్లుగా 14మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్యా రాజేశ్ (జీఎం ఆఫీస్), ఉపాధ్యక్షుడిగా ఉట్ల రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తోకల ప్రేమ్‌కుమార్, తేజావత్ వెంకన్న, రాము, వేణు, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, రఘు పాల్గొన్నారు

'ప్రమాద విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు..'

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 5: మణుగూరు ఓసీ-4 ఆఫ్ లోడింగ్‌లో ప్రమాదం జరిగిన విషయాన్ని గోప్యంగా ఉంచి భద్రాచలం ప్రైవేట్ ఆస్పత్రికి దుర్గా ఓబీ కంపెనీ తరలించడం ఏంటని ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఓసీ-4 దుర్గా ఆఫ్ లోడింగ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడికి నాలుగు రోజుల క్రితం యాక్సిడెంట్ జరిగి రెండు కాళ్లు విరిగినట్లు సమాచారం ఉందని అన్నారు. నియమ నిబంధనల ప్రకారం ఆఫ్ లోడింగ్‌లో ప్రమాదం జరిగితే వెంటనే సింగరేణి అధికారులకు, అక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్, సిబ్బందికి తెలిపి, ప్రమాదం వివరాలను మైనింగ్ ఇన్‌స్పెక్టర్‌కు తెలపాలని ఆయన పేర్కొన్నారు. ప్రమాదం బారిన పడిన కార్మికుడిని సింగరేణి ఆస్పత్రిలో చికిత్స ఇప్పించాలని, అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేయాలన్నారు. కానీ దుర్గా కంపెనీ యాజమాన్యం ఇవేమీ లెక్క చేయకుండా గోప్యంగా భద్రాచలం ప్రైవేట్ ఆస్పత్రిలో కార్మికుడికి చికిత్స చేయిస్తున్నారన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి ఈ సంఘటనపై విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనట్లయితే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పరశురామావతారంలో జగదభి రాముడు

భద్రాచలం, జనవరి 5: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆరోవ రోజు ఆదివారం శ్రీసీతారామచంద్రస్వామివారు పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామిని పరశురావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి నిత్యకల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేదపండితులు స్వామికి వేద విన్నపాలు సమర్పించారు. అనంతరం మిథిలా స్టేడియానికి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువస్తుండగా అగ్రభాగాన మహిళలు కోలాట నృత్యాలు వేశారు. మిథిలా స్టేడియంలో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం పరశురామావతారంలో ఉన్న స్వామివారిని వీక్షించి భక్తులు తరించిపోయారు. శ్రీమహావిష్ణువు జమదగ్ని అనే మహర్షికి కొడుకుగా జన్మించి పరశురాముడు (భార్గవరాముడు) అని పిలవబడుతూ దుష్టుడైన కార్తవీర్యార్జునుని, దుర్మార్గులైన రాజులను 21 మార్లు దండెత్తి సంహరించాడు. పరశురామావతరంలో ఉన్న స్వామివారిని దర్శిస్తే శుక్రగ్రహ బాధలు ఉన్నవారికి అవి తొలగిపోయి శుభాలు పొందుతారని వేదపండితులు చెబుతున్నారు.

నేడు శ్రీరామావతారం

ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఏడోవరోజు సోమవారం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారు నిజరూపంలోని శ్రీరామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కోటి గోటితలంబ్రాల వడ్లకు పూజ

పరశురామావతారంలో భద్రాద్రి రాముడు, గోటి తలంబ్రాల తయారీకి వడ్లను తీసుకువచ్చిన భక్తులు

ఖమ్మం నగరానికి చెందిన లక్ష్మీ బాలాజీ సేవాసమితి ఆధ్వర్యంలో భక్తబృందం ఈ ఏడాది జరగబోయే శ్రీసీతారాముల లోకకల్యాణం కోసం కోటి గోటి తలంబ్రాలను తయారుచేసేందుకు వడ్లను ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఆదివారం పూజలు చేయించారు. సేవాసమితి చైర్మన్ వడ్డే లక్ష్మి మాట్లాడుతూ గోటి తలంబ్రాలు తయారుచేసి ఆలయానికి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. అందులో భాగంగా ఆలయానికి గోటి తలంబ్రాల వడ్లను క్వింటాకు పైగా తీసుకువచ్చి వడ్ల పూజ చేయించామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.వెంకటరమణ, వీ.పూర్ణచంద్రశేఖర్, ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్.తులసి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

పరశురామావతారంలో పర్ణశాల రాముడు

దుమ్ముగూడెం, జనవరి 5: ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా పర్ణశాల రాముడు ఆరోవరోజు ఆదివారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రాచలం శ్రీరామ నాట్యాలయం గురువు భాగ్యశ్రీ సాయి శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. మహిళలు కోలాట నృత్యం చేశారు. అనంతరం భక్తులకు కట్టెపొంగలి ప్రసాద వితరణ చేశారు. స్వామివారికి మేళతాళాలు, మంత్రోచ్చరణల నడుమ తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, ముఖ్య అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, వేదపండితులు నరసింహాచార్యులు, నలదీగల నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, శివ, రాము, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చినజీయర్ ట్రస్ట్ చేయూత

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 5 : మండలంలోని మొగరాలగుప్ప గ్రామంలోని పేదలు, విద్యార్థులకు చినజీయర్ ట్రస్ట్ చేయూత నందించింది. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసింది. నిరుపేదలకు బియ్యం, దుప్పట్లు అందజేసింది. కొత్తగూడెంకు చెందిన వడ్డెన సతీష్ విద్యార్థులకు ఆట వస్తువుల కోసం రూ.10 వేలు విరాళం అందించారు. డీఎంకే స్కూల్ కరస్పాండెంట్ మృదుల బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, హెచ్ఎం స్వరూప, భవాని, రామకృష్ణ, తాండ్ర ప్రభాకర్‌రావు, అంజి, తాటి తులసి, గోపయ్య, ప్రసాద్, సుధీర్, రవి, సురభి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలి

మణుగూరు టౌన్, జనవరి 5: గ్రామస్థాయి నుంచి బీఆర్ఎస్ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా ప్రతీ ఒక్క కార్యకర్త, నాయకులు పనిచేయాలని బీఆర్ఎస్ మణుగూరు మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో మడి వీరన్న బాబు అధ్యక్షతన జరిగిన కూనవరం పంచాయతీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతో అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం పూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి నేటికీ 13 నెలలు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీలను అమలు చేయలేదని దుయ్యబట్టారు. కూనవరం పంచాయతీ నూతన కార్యవర్గ సభ్యులు పార్టీ బలోపేతం కోసం తమశక్తివంచన లేకుండా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోశం నర్సింహారావు, మణుగూరు పట్టణ కన్వీనర్ కుంట

మాట్లాడుతున్న కుర్రి నాగేశ్వరరావు

లక్ష్మణ్, నాయకులు వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, ఆవుల నర్సింహారావు, అక్కి నర్సింహారావు, నాకెల్లి వెంకట్, కూనవరం మాజీ సర్పంచ్ ఎనిక ప్రసాద్, కాటబోయిన సుజాత, సకిని బాబురావు, కలగూర శంకర్, ఉప్పుతల రామారావు, బర్ల సురేష్, జట్పుట్ వెంకన్న, రాగం సరోజిని, కందిమల్ల లక్ష్మీ, దైద ఏసుమణి, ఇజ్రాయిల్, గుగులోత్ హాటియ పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

భద్రాచలం, జనవరి 5: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం ప్రకటించిందని, అందులో భాగంగా త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ ఐక్యవేదిక నాయకులు బొలిశెట్టి రంగారావు ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తాళ్ల రవికుమార్, కడియం రామాచారి, బండారు నాగేశ్వరరావు, నర్సింహాచారి, మేకల మల్లుబాబు, కోపానతి శాంతారావు, కొమ్మనపల్లి ఆదినారాయణ, ఏకులు రామచంద్రయ్య, గండేపల్లి హనుమంతరావు, యర్రంశెట్టి నర్సింహారావు, రాంప్రసాద్, ధనేకుల శ్రీనివాసరావు, వెంకటరమణ, రమణయ్య, చల్లంగి దత్తాత్రేయ, సీతారాం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి'

ముత్యాలంపాడు గ్రామస్తులతో ముచ్చటిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేట(ములకలపల్లి), జనవరి 5 : గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, బీఆర్ఎస్ పార్టీ తరపున అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గ్రామస్తులకు అభయమిచ్చారు. ములకలపల్లి మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గంగారం మాజీ సర్పంచులు శేషా లక్ష్మి, కుంజా నాగమణితో కలిసి గ్రామస్తులతో ముచ్చటించారు. ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని, ప్రజలకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రాంబాబు, ప్రసాద్, తాటి ప్రవీణ్ ఉన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

అశ్వారావుపేట(ములకలపల్లి), జనవరి 5 : గ్రామ పంచాయతీల్లో కార్మికుల మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండివైఖరితో కార్మికులు వెట్టిచాకిరీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ములకలపల్లి మండలం జగన్నాథపురంలో ఏఐటీయూసీ మండల ప్రథమ మహాసభ ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్మికులకు రూ.20 లక్షల బీమా, గ్రాడ్యూటీ, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యూసుఫ్, నారం సునీత, ఎస్‌కె.జబ్బార్, గద్దల మహేశ్, రమేశ్, అశోక్, కె.సతీష్, సంజీవరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

మాట్లాడుతున్న దిండిగాల రాజేందర్

ఇల్లెందు, జనవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని ఎన్నికల ముందు రైతులకు హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత 12వేలు వేస్తామని అనడం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని, ప్రతి రైతుకు రెండు లక్షలు రుణమాఫీ అని, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం అని హామీలు ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నాడని దుయ్యబట్టారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ నిలబడికాంగ్రెస్ హామీలు ఇచ్చేలా పోరాడుతుందన్నారు.

'బోగస్‌గా మారిన బోనస్'

టేకులపల్లి, జనవరి 5: సన్న రకం వరి ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ బోగస్‌గా మారిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వర ప్రసాద్‌గౌడ్ అన్నారు. ఆదివారం టేకులపల్లిలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడి సంవత్సరం దాటిన ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వరి ధాన్యం సన్న రకానికి ప్రభుత్వం బోనస్ ఇస్తామని చెప్పిందని, కానీని రైతుల ఖాతాలో బోనస్ పడటం లేదన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పేరుతో కాలాయాపన చేస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఏడాదిగా పనిచేయని మంచినీటి పథకం

ప్రభుత్వాసుపత్రిలో నీటికి ఇబ్బందులు

చండ్రుగొండ, జనవరి 5 : మండల కేంద్రమైన చండ్రుగొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రిలో ఉన్న మంచినీటి పథకం ఏడాది క్రితం మరమ్మతులకు గురైంది. నాటి నుంచి నేటి వరకు ఆ పథకానికి మరమ్మతులు చేయకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలు, వైద్యసిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఎవరికి వారు తమ వెంట మంచినీటిని బాటిళ్లతో తెచ్చుకొని దాహర్తిని తీర్చుకుంటున్నారు. ఆసుపత్రిలో మంచినీటి ఇబ్బందిని అధికారులు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు స్థానికులు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు సైతం వచ్చి మంచినీటి పథకాన్ని అనేకమార్లు చూసినా మరమ్మతులు చేయించకపోవడం పట్ల ప్రజలు, రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చండ్రుగొండ ఆసుపత్రిలో మరమ్మతులకు గురైన మంచినీటి పథకం

నిత్యం వందలాది రోగులు వచ్చే ప్రభుత్వ ఆసుపత్రికి మంచినీటి ఇబ్బందులు ఉన్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రిలో గల మంచినీటి పథకానికి మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడ్డ సింగరేణి

కొత్తగూడెం సింగరేణి, జనవరి 5: బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సంస్థ వెనుకబడింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. డిసెంబర్ నాటికి 50.61 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలి. కానీ, 46.76 మిలియన్ టన్నుల ఉత్పత్తి (92 శాతం) మాత్రమే జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా మూడు నెలలే మిగిలాయి. ఈ స్వల్ప కాలంలో 25.24 మిలియన్ టన్నుల బొగ్గు (రోజుకు 2.70 లక్షల టన్నులు) ఉత్పత్తి చేయాలి. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కుస్తీ పడుతున్నారు. సింగరేణిలోని మొత్తం 11 ఏరియాలకుగాను కేవలం ఇల్లెందు (125 శాతం), అడ్రియాలా ప్రాజెక్ట్ (105 శాతం) మాత్రమే లక్ష్యాన్ని అధిగమించాయి. మిగిలిన ఏరియాలేవీ లక్ష్యాన్ని సాధించలేదు. ఈ ఏడాది అధిక వర్షపాతం కారణంగా ఉత్పత్తిలో వెనుకబడినట్లు అధికారులు చెబుతున్నారు. ఉత్పత్తి లక్ష్యాన్ని

ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తి దృశ్యం

సాధించేందుకు ఎనిమిది నుంచి 14 గంటల వరకు పని చేయాలని, యంత్ర సామర్థ్యాన్ని గరిష్టంగా వినియోగించాలని కార్మికులపై ఒత్తిడి పెంచుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పుడే కాదు.. గత ఐదారు సంవత్సరాలుగా (2023-24 ఆర్థిక సంవత్సరం మినహా) వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సింగరేణి సాధించడం లేదు. ఈ ఏడాది కూడా లక్ష్యాన్ని సాధించకపోచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'

కొత్తగూడెం టౌన్, జనవరి 5: ఈ నెల 6న (సోమవారం) కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్

భద్రాచలం, జనవరి 5: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. గిరిజనులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌కే సాబీర్‌పాషా

జూలూరుపాడు, జనవరి 5: జూలూరుపాడులో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ పోటీలను సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా ప్రారంభించారు. నాయకులు గుండుపిన్ని వెంకటేశ్వర్లు, చంద్ర నరేంద్రకుమార్, షేక్ చాంద్‌పాషా, మధు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 5: తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలల లైబ్రేరియన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీని ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగిన సమావేశం ఎన్నుకుంది. గౌరవాధ్యక్షుడిగా కె.గరుడాచలం (భద్రాచలం), అధ్యక్షుడిగా కె.ప్రసాద్‌బాబు (ఇల్లెందు), ఉపాధ్యక్షుడిగా వి.నవీన్ (చర్ల), కార్యదర్శిగా ఎండీ ఖాసీం (గుండాల), సహాయ కార్యదర్శిగా బి.బాబు (కొత్తగూడెం), మహిళా కార్యదర్శిగా విజయలక్ష్మి (దుమ్ముగూడెం), కోశాధికారిగా ఎండీ సలీం జావీద్ (పినపాక), కార్యవర్గ సభ్యులుగా ప్రభావతి (మణుగూరు), పద్మావతి (బూర్గంపాడు) ఎన్నికయ్యారు.

20న ఐటీడీఏ ముట్టడి

పాల్వంచ, జనవరి 5: ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్న డిమాండుతో ఈ నెల 20న ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు తెలిపారు. దీనిని ఆదివాసీలంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య దొర అధ్యక్షతన ఆదివారం పాల్వంచలో జరిగిన సమావేశంలో కామరాజు మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోగల ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలు, జీవోలు ఏమాత్రం అమలవడం లేదని విమర్శించారు. మైదాన ప్రాంతం నుంచి గిరిజనేతరులు వలస వచ్చి ఏజెన్సీ మండలాలు, గ్రామాల్లో స్థిరపడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని, వడ్డీ వ్యాపారాలు సాగిస్తున్నారని, ఐటీడీఏ అధికారులుగానీ.. ఎమ్మెల్యేలుగానీ ఏమాత్రం స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ ఐటీడీఏ ముట్టడిని ఆదివాసీలు జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఈసాల సురేష్, తాటి వెంకటేశ్వర్లు, నూప సీతయ్య, భట్ట కనకరాజు, పాయం రమేష్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో జీఎం చెరగని ముద్ర..

జీఎంకు స్వీట్లు తినిపిస్తున్న నాయకులు

మణుగూరు టౌన్, జనవరి 5: గతేడాదిలో నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలు, కార్మిక సంక్షేమం, అభివృద్ధి మౌలిక వసతుల సాధనలో మణుగూరు ఏరియాలో జీఎం దుర్గం రాంచందర్ చెరగని ముద్ర వేశారని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి తెలిపారు. ఆదివారం ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం దుర్గం రాంచందర్‌ను కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్, బంగారి పవన్‌కుమార్, మస్తాన్, ముకేశ్, మురళి, కృష్ణ, ఇమ్రాన్, నరేశ్, వినయ్‌కుమార్, శంకరయ్య, రమేశ్‌బాబు, రమేశ్, సుధాకర్ యాదవ్, వినోద్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, రేవన్ పాల్గొన్నారు.

బాధితురాలికి నిత్యావసరాలు పంపిణీ